సాక్షి చిత్తూరు

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్ సీపీలోకి వలసలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. - 8లో



క్రీడా పరికరాల సీజ్

తుంబపాళెం జెడ్పీ హైస్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేసిన క్రీడా పరికరాలను అధికారులు సీజ్ చేశారు. - 8లో



పేదలు..పెత్తందార్లకు మధ్యే ఎన్నికలు

రాష్ట్రంలో ప్రస్తుత ఎన్నికలు పేదవారికి, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయని మంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

నంబర్ వన్‌గా రొంపిచెర్ల పీహెచ్‌సీ



రొంపిచెర్ల పీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని అభినందిస్తున్న జిల్లా అధికారులు

రొంపిచెర్ల: మాతాశిశువులు, గర్భిణుల నమోదులో రొంపిచెర్ల పీహెచ్‌సీ చిత్తూరు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు డేటాను ఆన్‌లైన్ చేయడంలో చురుగ్గా పనిచేసి ఆర్‌సీహెచ్‌లో 100 శాతం పూర్తి చేశారు. ఇక్కడ డాక్టర్లు దినేష్ కుమార్ నాయక్, వినయ్ పనిచేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించడంతోపాటు జాతీయ కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేస్తున్నారు. వారం రోజుల క్రితం జిల్లా అధికారులు రొంపిచెర్ల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ పీహెచ్‌సీ జిల్లాలోనే మొదటి స్థానంలో ఉందని సమాచారం ఇచ్చారు. గతంలో రొంపిచెర్ల పీహెచ్‌సీ ఏపీలోనే చివరి స్థానంలో ఉండేది. నేడు జిల్లాలో మొదటి స్థానంలో నిల్వడానికి సిబ్బంది పనితీరుకు నిదర్శనమని అధికారులు అభినందించారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సెలవు కారణంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఉదయం నుంచే రద్దీ నెలకొంది. క్యూలు నిండాయి. వారికి అధికారులు శీఘ్ర దర్శనం కల్పించారు. రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు నియోజకవర్గంలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చిత్తూరు ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన ఆదివారం క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం, నగదు, డ్రగ్స్ అక్రమంగా రవాణా కాకుండా సరిహద్దు చెక్ పోస్టు వద్ద నిఘా పటిష్టం చేయాలన్నారు. ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని పేర్కొన్నారు. 2019 ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా అవగాహన కల్పించాలని వెల్లడించారు.

చిత్తూరు గంగజాతరకు అనుమతి లేదు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు నడివీధి గంగమ్మ జాతరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మే 14, 15 తేదీల్లో చిత్తూరు నగరంలో జాతర నిర్వహించాలని అనుకుంటున్నారని, తాము అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయంపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. ఈ విషయంపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మకూడదని వెల్లడించారు.

ఎన్నికల్లో సెక్టోరల్ ఆఫీసర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న చిత్తూరు ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్, రూట్ ఆఫీసర్ల పాత్ర కీలకమని చిత్తూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గంలోని సెక్టార్, రూట్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలు, పోలింగ్ రోజు చేపట్టే విధులపై అవగాహన ఉండాలన్నారు. సెక్టోరల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని కమ్యూనికేషన్ ప్లాన్‌ను అమలు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దన్నారు. పోలింగ్ రోజున సమర్పించాల్సిన రిపోర్టులపై అవగాహన పెంచుకోవాలన్నారు. పీవో, ఏపీఓల హ్యాండ్ పుస్తకాలను చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్ సౌందర్‌రాజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ పనితీరు, ఆపరేట్ విధానం తదితరాలపై అవగాహన కల్పించారు. ఏఆర్వో, కమిషనర్ జె అరుణ, ఆర్డీవో చిన్నయ్య, పలమనేరు ఆర్డీవో మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఆగ్రహ జ్వాల



పాకాలలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు

సీఎం జగన్‌పై రాళ్ల దాడి అమానుషం

- చంద్రబాబు, పవన్ నీచ రాజకీయాలకు నిదర్శనం
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెల్లుబికిన నిరసనలు



తిరుపతిలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బ్యానర్లను తగలబెడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



శ్రీకాళహస్తి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

తిరుపతి మంగళం : 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్లదాడిని అభిమానులు, నేతలు, కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఖండించారు. శనివారం రాత్రి ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు మిన్నంటించారు. జగనన్నకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రోద్బలంతో అగంతకుల చేత రాళ్లదాడి చేయించినట్టు ఆరోపించారు. తిరుపతి అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లని బాబు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ బ్యానర్లు దహనం చేశారు. రాష్ట్ర ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, దీన్ని చూసి ఓర్వలేక రౌడీమూకలతో రాళ్ల దాడి చేయడం సిగ్గుచేటని విరుచుకుపడ్డారు. చంద్రబాబు నీచ రాజకీలకు ఇది నిదర్శనమని మండిపడ్డారు. సింహంలాగా సింగిల్‌గా వస్తున్న జగనన్నను ఎదుర్కోలేక రాళ్ల దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. పాకాల మండల కేంద్రం, ఆర్టీసీ బస్టాండ్ కూడలి, దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద, శ్రీకాళహస్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన చేపట్టారు. ఇది ముమ్మాటికీ టీడీపీ నాయకుల కుట్రతోనే జరిగిందని ఆరోపించారు. పార్టీ నాయకులు దొడ్డారెడ్డి శంకర్రెడ్డి, తిరుమలరెడ్డి, కోటూరు శశి, తాలూరి ప్రసాద్, మోహన్, శీను, సిద్దు, నాగరాజు, సింగిల్‌విండో చైర్మన్ మునీశ్వర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మునీర్, డివిజన్ అధ్యక్షుడు కపిలేశ్వర్‌రెడ్డి, గుండ్లూరి సురేష్, డాక్టర్ శివకుమార్, రాయలసీమ మోహన్, ఎంపీటీసీ సురేష్, సర్పంచ్ వసంత, నంద, జేసీపీ బాబు, ప్రకాష్, బాను, గిరి, హరీష్, రాజు, మురళి, బేటా, రెహంతుల్లా పాల్గొన్నారు.

నరరూప రాక్షసుడు చంద్రబాబు



చంద్రబాబు మానవ రూపంలో ఉన్న రాక్షసుడు. అధికారం కోసం హత్యలు చేయడానికి కూడా వెనుకాడడు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 సీట్లు గెలిచే అవకాశం ఉంది. అందువల్లే కడుపు మంటతో జగనన్నపై దాడి చేశారు. దీన్ని ఎన్నికల కమిషనర్‌తోపాటు సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళతాం. చంద్రబాబుకు ధన దాహం, పదవీ దాహం తప్ప ప్రజలపై ప్రేమ లేదు. ఇంత జరిగి నా మా సీఎం సహనాన్ని చూసి బుద్ధి తెచ్చుకోవాలి. చంద్రబాబుకు ప్రజలే గుణపాఠం చెబుతారు.

– నారాయణస్వామి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి

ఓర్వలేకే దాడులు



సీఎం జగనన్నకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక దాడులు చేయించడం చంద్రబాబుకు తగదు. సిద్ధం బస్సు యాత్రకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. దీంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రజలకు మీరు ఏమి చేస్తారో చెప్పాలి. అంతేగాని ఇలా దాడులు చేయించడం మంచి పద్ధతి కాదు.

– కృపాలక్ష్మి, జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి

రైతుకు భరోసా

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించేది కాదు. దీంతో పంటల సాగుకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితి. ఇది ఐదేళ్ల క్రితం నాటి మాట. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితి మారింది. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన వ్యక్తి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. నేనున్నానంటూ రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానికంగానే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి తెచ్చారు. భూసార పరీక్షలు చేసి తగిన పంటలు సాగు చేయడంతోపాటు మెళకువలు అందించేలా చర్యలు తీసుకున్నారు. పంటల సాగుకు పెట్టుబడి కోసం రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 ఇస్తూ వచ్చారు. వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల కరెంటు ఇచ్చారు. తద్వారా వ్యవసాయం దండగ అన్న మాట నుంచి పండుగలా మార్చారు.

- స్థానికంగానే రైతు భరోసా కేంద్రాలు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- పంటల సాగుపై అవగాహన
- రైతు భరోసా కింద పెట్టుబడి సాయం
- వ్యవసాయాన్ని పండుగ చేసిన సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో 81 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఒక్కొక్క కేంద్రానికి సుమారు రూ.20 లక్షల చొప్పున రూ.16.20 కోట్లతో భవనాలు నిర్మించారు. ఆయా కేంద్రాల్లో తగినంత మంది సిబ్బందిని నియమించారు. వారి ద్వారా రైతులకు స్థానికంగానే సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఆర్‌బీకేల ద్వారా రైతులకు 45,119 సేవలు అందించారు.



మేలుందొడ్డిలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి(ఫైల్)

పుంగనూరు నియోజకవర్గ సమాచారం

మండలం	ఆర్బీకేలు	ఖర్చు	మొత్తం రైతులు	లబ్ధిపొందిన వారు
పుంగనూరు	22	రూ.4.40 కోట్లు	11,852	8,658
చౌడేపల్లె	14	రూ.2.80 కోట్లు	5,965	3,692
సోమల	13	రూ.2.60 కోట్లు	9,856	5,623
సదుం	11	రూ.2.20 కోట్లు	6,950	4,030
పులిచెర్ల	13	రూ.2.60 కోట్లు	5,725	3,658
రొంపిచెర్ల	8	రూ.1.60 కోట్లు	4,771	3,525
మొత్తం	81	రూ.16.20 కోట్లు	45,119	29,186

ఆర్బీకేల వద్దే అన్ని సేవలు



ప్రభుత్వం రైతులకు ఆర్బీకేల ద్వారా అన్ని సేవలూ అందిస్తోంది. సిబ్బంది విత్తనాలు, ఎరువులు ఇవ్వడంతోపాటు కొత్త పంటల సాగు, దిగుబడి పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. రైతులకు ప్రభుత్వ పరంగా లబ్ధిచేకూర్చే సేవలు, పథకాలు, రాయితీలు, కొత్త వంగడాలపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో భూసార పరీక్షలు చేయాలంటే ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు సిబ్బంది పొలానికే వచ్చి పరీక్షలు చేసి ఏ పంటలు వేసుకోవాలో చెబుతున్నారు. – శ్రీరాములు, సీతన్నగారిపల్లె, సదుం

మా ఊర్లోనే అన్ని సదుపాయాలు



ఆర్బీకేల ద్వారా మా ఊర్లోనే రైతులకు అవసరమైన సేవలతోపాటు యంత్ర పనిముట్లు అందజేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు ఇస్తున్నారు. యాంత్రీకరణ, బిందుసేద్యంపై చైతన్యం కల్పిస్తున్నారు. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసి దిగుబడి సాధించడంపై వివరిస్తున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించారు. పెట్టుబడి కోసం ఇబ్బంది లేకుండా సాయం చేస్తున్నారు. ఇన్ని చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. – డీఎస్ గోవిందరెడ్డి, ముతుకువారిపల్లె, పులిచెర్ల

ఇబ్బందులు తప్పాయి



నేను 50 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. అవసరాల కోసం 20 కిలోమీటర్ల దూరంలో ఉండే పుంగనూరు వ్యవసాయ కార్యాలయానికి వెళ్లే వాళ్లం. అక్కడ ఎరువులు, మందులు ఉండేవి కాదు. అధికారులు ఉండరు. సీఎం జగన్ దగ్గరలో ఆర్బీకేలు పెట్టారు. ఉద్యోగులు నిరంతరం సూచనలు, సలహాలిస్తున్నారు. ఎరువులు, విత్తనాలకు కొరతలేదు. మాకు ఇంటికాడ సౌకర్యం కల్పించిన సీఎం జగన్ చల్లగా ఉండాలి.

– ఎం.నారాయణప్ప, కుమ్మరగుంట, పుంగనూరు

ఎరువులు, విత్తనాలు సులభంగా దొరుకుతున్నాయి



గతంలో వేరుశనగ విత్తనాలు, ఎరువుల కోసం చౌడేపల్లెకు వెళ్లి ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్.జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మా ఊరులోనే ఆర్బీకే పెట్టారు. ఎమ్మార్పీ ధరలకే అధికారులు విక్రయిస్తున్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు పొలాల వద్దకే వచ్చి పంటలకు సోకే తెగుళ్లు, సస్య రక్షణ మందుల వాడకంపై సలహాలు ఇస్తున్నారు. అధిక దిగుబడులు సాధించడానికి మాకు ఎంతో సహకరిస్తున్నారు. అంతేగాక పెట్టుబడి కోసం ఏడాదికి రూ.13,500 ఇస్తున్నారు.

– పి.మురళీమోహన్, ఆమినిగుంట, చౌడేపల్లె




చౌడేపల్లె : వైఎస్సార్ పొలం బడి నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)



చౌడేపల్లె మండలం పెద్దకొండామర్రి సచివాలయంలో విత్తనాల పంపిణీ (ఫైల్)

అభివృద్ధి చేశాం.. ఆదరించండి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పులిచెర్ల మండలంలో ఎన్నికల ప్రచారం



మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో పుంగనూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన శనివారం పులిచెర్ల మండలంలోని 13 పంచాయతీల్లో ప్రచారం చేశారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశామన్నారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తారురోడ్లు, పక్కా గృహాలు నిర్మించినట్టు చెప్పారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించామన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు జనసేన, బీజేపీతో జత కట్టి ఓట్ల కోసం తప్పుడు వాగ్దానాలతో మీముందుకు వస్తున్నారని తెలిపారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని పేర్కొన్నారు. ఇప్పుడు చంద్రబాబు మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చి సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ మేలు చేశారని వివరించారు. ఈ పథకాలన్ని తిరిగి కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ రావాలన్నారు. చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను గుర్తుంచుకుని ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్, కన్వీనర్ నాదమునిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముర్వత్ బాషా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు హేమ సుందరరెడ్డి, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్ రెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, పోకల చంద్ర, రెడ్డి అహమ్మద్, ఉషారాణి, షుకూర్, స్వాతి బాల, ఆనంద, చంద్రశేఖరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సమర్పణకు ప్రత్యేక తేదీలు

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సమర్పించేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చి తేదీలు ప్రకటిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 అందజేసేందుకు గందరగోళం చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయా ఉద్యోగుల లభ్యతను నిర్ధారించడానికి రశీదు ఇచ్చేందుకు మాత్రమే ఏప్రిల్ 15వ తేదీని గడువుగా పెట్టామన్నారు. ఫారం 12 సమర్పించేందుకు చివరి తేదీ సూచించలేదన్నారు. ఈ విషయాన్ని జిల్లాలో ని ఆర్‌ఓలు, ఆయా శాఖల హెచ్‌ఓడీలు ఉద్యోగులకు తెలియజేయాలని ఆదేశించారు.

డీలర్ రంగనాథం తొలగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గుడిపాల మండలానికి చెందిన 16వ నంబర్ రేషన్ షాపు డీలర్ రంగనాథం టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. అధికారులు విచారణ చేపట్టారు. ఆయన నిబంధనలకు విరుద్ధంగా చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నట్టు గుర్తించారు. దీంతో ఆయనను తొలగిస్తూ చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

క్లుప్తంగా

ఇంటర్‌లో కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ



అధిక మార్కులు సాధించిన విద్యార్థులు

పుంగనూరు: ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయ పాఠశాల విద్యార్థిని కేపీ అతికున్నిసా 979 మార్కులు సాధించి స్టేట్‌లో టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ వాసియా ఫర్హత్ తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ కేజీబీవీలో 33 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని తెలిపారు. వారిలో 28 మంది ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. కేపీ అతికున్నిసా 979 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచిందని, అజ్మియాభాను 954, సబానాజ్ 944 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అలాగే ప్రథమ సంవత్సరంలో యాస్మిన్ 484, కళ్యాణి 479, మెహతాజ్ 476 మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు.

ఐచర్ వాహనం ఢీకొని డ్రైవర్ మృతి

పలమనేరు: పట్టణ సమీపంలోని జగమర్ల క్రాస్ వద్ద చెన్నై– బెంగళూరు హైవేలో శనివారం మినీ టెంపోను ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో డ్రైవర్ మృతిచెందాడు. బైరెడ్డిపల్లి మండలం దాసార్లపల్లికి చెందిన గౌతంరాజు మినీ టెంపోలో టెంకాయలు లోడు చేసుకుని బంగారుపాళెం వైపు వెళుతున్నాడు. మొగిలి ఘాట్‌లో అల్యూమినియం లోడుతో బెంగళూరు వైపు వెళుతున్న ఐచర్ వాహనం ఢీకొంది. డ్రైవర్ గౌతం రాజు మృతిచెందాడు. పక్కనే ఉన్న కుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పలమనేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



సుబ్రమణ్యం(ఫైల్)

పుత్తూరు: మండలంలోని మజ్జిగ గుంట వద్ద శనివారం తెల్లవారు జామున కారు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. తడుకు పంచాయతీ వేణుగోపాలపురం గ్రామానికి చెందిన బి.సుబ్రమణ్యం(60), నరసింహులు మండడి పనిమీద తిరుపతి బయలుదేరారు. మజ్జిగగుంట వద్ద నడిచి వెళ్తున్న సుబ్రమణ్యంను కారు ఢీకొని వెళ్లిపోయింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నరసింహులు మండడి ఈ విషయాన్ని గ్రామస్తులు, పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించారు. నెల్లూరు సమీపంలోని తడ వద్ద పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా వలసలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీకి చెందిన పలువురు నేతలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమాన్ని ఆపలేదని, పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందిస్తున్న సీఎం జగనన్నకు అండగా ఉండాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా ప్రచారం చేస్తామని పేర్కొన్నారు.



పుంగనూరు : భరిణేపల్లికి చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పులిచెర్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని భరిణేపల్లెకు చెందిన టీడీపీ నేతలు చందు యాదవ్, మంజునాథ్, పురుషోత్తం, సురేష్, బాలాజి, రాజేంద్రనాథ్, మురుగేష్, గోవిందు తదితర 20 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారని తెలిపారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి రెండు ఓట్లు వేసి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దేశిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బంగారుపాళెం మండలంలో..

బంగారుపాళెం: మండలంలోని తుంబపాళెంకు చెందిన టీడీపీ కార్యకర్తలు భాస్కర్, మోహన్, మురళి శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి పార్టీలో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు, పాళెం పంచాయతీలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు.

సొంత గూటికి చేరిన కార్యకర్తలు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చిత్తూరు బాబు, గంగయ్య, రామ్‌లక్ష్మణ కొద్ది రోజుల క్రితం టీడీపీలో చేరారు. అక్కడ ఇమడలేమని భావించి శనివారం రాయలపేటలో ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో మళ్లీ వైఎస్సార్ సీపీలో చేరారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య సలహాదారు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆంజమ్మ, నాయకులు పద్మనాభ జెట్టి, మునిరాజ, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్



పెద్దపంజాణి: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

క్రీడా పరికరాల సీజ్

బంగారుపాళెం: మండలంలోని తుంబపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేసిన క్రీడా పరికరాలను శనివారం మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేశారు. నలగాంపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ విక్రమ్ పాఠశాలకు క్రీడా పరికరాలు అందించేందుకు వచ్చారు. వారి వెంట స్థానిక టీడీపీ కార్యకర్తలు ఉన్నారు. అదే సమయంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ విషయం తెలుసుకుని పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఎన్నికల కోడ్ ఉండగా పాఠశాలలో క్రీడా పరికరాల పంపిణీకి ఎలా అనుమతిస్తారని హెచ్ఎంను ప్రశ్నించారు. ఈ విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో శివశంకర్ ఉపాధ్యాయులను విచారించారు. క్రీడాపరికరాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ఎంపీటీసీ పట్టాభి మృతి



నివాళులర్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

ఐరాల: మండలంలోని కామినాయనపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ పట్టాభి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఆ గ్రామానికి చేరుకున్నారు. పట్టాభి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, నేతలు పాల్గొన్నారు.

తమిళ బియ్యం స్వాధీనం

వి.కోట: తమిళనాడు నుంచి ఉప్పుడు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు సీఐ లింగప్ప తెలిపారు. వారి నుంచి 62 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ముందుగా అందిన సమాచారంతో శుక్రవారం రాత్రి కస్తూరి నగరం వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్టు తెలిపారు. ఈ క్రమంలో బొలేరో వాహనంలో ఉప్పుడు బియ్యం తరలిస్తున్న బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన హరి, గుండపల్లికి చెందిన వెంకటరమణ, పలమనేరు టౌన్‌కు చెందిన అహమ్మద్‌ను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. వారు ఉప్పుడు బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నారని తెలిపారు. వారి నుంచి 62 బస్తాల్లో ఉన్న 3,100 కేజీల ఉప్పుడు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా వస్తువులను తరలిస్తుంటే సమాచారం ఇవ్వాలని కోరారు.

పేదలు.. పెత్తందార్లకు మధ్యే ఎన్నికలు



ప్రచారం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : రాష్ట్రంలో ప్రస్తుత ఎన్నికలు పేదవారికి, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి పేర్కొన్నారు. ఆయన శనివారం ఎర్రమట్టిపల్లి దళితవాడ, ఎర్రమట్టిపల్లి గ్రామం, చిన్నమిట్టూరు, చిరుతగుంట, విడిదిపల్లి, విడిదిపల్లి దళితవాడ, ఎన్టీఆర్ కాలనీ, తాటిమాకులపల్లి, అత్తిమాకులపల్లిలో ప్రచారం చేశారు. ఆయనకు అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సంక్షేమానికి చిరునామా అని, చంద్రబాబు పాలన అవినీతికి కేరాఫ్ అన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం అని చెప్పి తన కొడుకు లోకేష్‌కు మంత్రి పదవి ఇచ్చుకున్నాడని దుయ్యబట్టారు. తన పరిపాలన అంతా దోచుకో.. దాచుకో అన్నట్టు సాగిందని విమర్శించారు. ఇప్పుడు అవినీతి, దోపిడీదారులంతా కలిసి కూటమిగా వస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు డబ్బు ఎర వేసి ఓట్లు పొందేందుకు సిద్ధమయ్యాడని ఆరోపించారు. పొరపాటున ఆయనకు ఓటు వేస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలను రద్దు చేస్తారని పేర్కొన్నారు.

కరువుకు కేరాఫ్ చంద్రబాబు

రాష్ట్ర విదేశీ వ్యవహారాల సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, కరువు కవల పిల్లలని ఎద్దేవా చేశారు. ఆయన హయాంలో ఏనాడూ సక్రమంగా వర్షాలు కురవలేదన్నారు. పంటలు పండక, గిట్టుబాటు ధరలేక రైతులు ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. చంద్రబాబు ఎన్ని కూటమిలతో కలిసి వచ్చినా ప్రజల ఆశీర్వాదం జగనన్నకు మెండుగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలతారెడ్డి, మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ సురేష్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ దొరస్వామియాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు దూది మోహన్, ఎంపీటీసీ శివలింగం, మాజీ సర్పంచ్ చెంగల్రాయులు, మాజీ ఎంపీటీసీ గురుమూర్తి, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

మీకు మంచి జరిగితేనే ఓటు వేయండి

పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పరిపాలన సాగించినట్టు వివరించారు. మంచి చేసినందునే 'మీకు మేలు జరిగి ఉంటేనే మాకు మళ్లీ ఓట్లు వేయండి' అని తమ నాయకుడు ముందుకు వచ్చినట్టు పేర్కొన్నారు. సీఎం జగనన్న బాటలోనే పేదలకు సేవ చేసేందుకు తన బిడ్డ కృపాలక్ష్మి పోటీ చేస్తోందన్నారు. చేసిన మంచిని గుర్తు పెట్టుకుని ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను గెలిపించాలని కోరారు.

టీడీపీ వేధింపులతో వలంటీర్ల రాజీనామా



బైరెడ్డిపల్లె : రాజీనామా చేస్తున్న నెల్లిపట్ల వలంటీర్లు

బైరెడ్డిపల్లె : టీడీపీ నేతల వేధింపులకు నిరసనగా మండలంలోని నెల్లిపట్ల సచివాలయ పరిధిలోని 16 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రాజేష్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ గౌరవ వేతనంతో పని చేస్తూ ప్రజలకు పథకాలు అందించామని తెలిపారు. టీడీపీ, జనసేన నేతలు తమను మాటలతో వేధిస్తుండడంతో రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పనిచేస్తామని తెలిపారు.